కీసర ఆర్డీవోకు సీడ్ గణపతి అందజేత



కీసర: గ్రీన్ ఇండియా ఛాలెంజ్ వ్యవస్థాపకులు, మాజీ ఎంపీ జోగినపల్లి సంతోష్‌కుమార్ ఆదేశాల మేరకు హరితసేన రాష్ట్ర మహిళా విభాగ అధ్యక్షురాలు నాయకురాలు మాధురివెంకటేష్ శుక్రవారం కీసర ఆర్డీవో వెంకటఉపేందర్ రెడ్డిని కలిసి మట్టి సీడ్ గణపతిని అందజేశారు. గోరంటి ప్రవీణ్, బాలరాజు, ఆంజనేయులు, సతీష్‌యాదవ్ పాల్గొన్నారు.

బీజేపీ నేతల ముందస్తు అరెస్ట్



ఘట్‌కేసర్ పోలీసుల అదుపులో బీజేపీ నేతలు

ఘట్‌కేసర్: దేశంలో అక్రమంగా నివసిస్తున్న విదేశీయులను తక్షణమే వారి దేశానికి పంపించాలని డిమాండ్ చేస్తూ.. శుక్రవారం చేపట్టిన సచివాలయం ముట్టడి కార్యక్రమాన్ని పోలీసులు అడ్డుకున్నారు. బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, మండల, మున్సిపల్ అధ్యక్షులు ప్రవీణ్‌కుమార్, హనుమాన్, శ్రీనివాసులు, నాయకులు వీరేశం, రాజశేఖర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, మురళిని ముందస్తు అరెస్ట్ చేసి స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేశారు.

మున్సిపల్ కార్మికుల వేతన బకాయిలు చెల్లించాలి

శామీర్‌పేట్: గ్రామపంచాయతీ, మున్సిపల్ కార్మికులకు బకాయి వేతనాలను వెంటనే చెల్లించాలని ఈఎస్ఐ, పీఎఫ్‌ను వెంటనే విడుదల చేయాలని మేడ్చల్ జిల్లా సీఐటీయూ ఉపాధ్యక్షుడు ఎన్. శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం అలియాబాద్ మున్సిపాలిటీ కార్మికుల జనరల్ బాడీ సమావేశాన్ని అలియాబాద్ మున్సిపాలిటీలోని గ్రంథాలయం వద్ద యూనియన్ నాయకుడు ఆరోగ్యం, ముత్యాలు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... గత 4 నెలలుగా మున్సిపల్ కార్మికులకు బకాయిపడిన వేతనాలను ప్రభుత్వం చెల్లించడం లేదని విమర్శించారు. కార్మికులకు చెల్లించాల్సిన వేతనాలను వెంటనే చెల్లించకపోతే పెద్దఎత్తున ధర్నాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. మున్సిపల్ నాయకులు కృష్ణ, లలిత, లత, మంజుల, లింగయ్య, కార్మికులు పాల్గొన్నారు.

చెరువులో దూకి వ్యక్తి ఆత్మహత్య

శామీర్‌పేట్: పెద్దచెరువులో ఓ వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన శుక్రవారం శామీర్‌పేట్ పోలీస్‌స్టేషన్‌లో చోటు చేసుకుంది. వివరాల ప్రకారం ... మైసమ్మగూడకు చెందిన రసూల్ (25) కుటుంబంతో కలిసి ఉంటున్నాడు. కాగా ఈ నెల 20న రాత్రి కటుంబసభ్యులతో కలిసి భోజనం చేసి నిద్రకు ఉపక్రమించాడు. మరుసటి రోజు ఉదయం ఇంట్లో నుంచి వెళ్లిన అతడు 'కుటుంబసభ్యులకు నేను వెళ్తున్నా'.. అని వాట్సప్‌లో మెసేజ్ పంపాడు. ఫోన్ లొకేషన్ శామీర్‌పేట కట్టమైసమ్మ చెరువు వద్ద చూపిస్తుండటంతో కుటుంబసభ్యులు అక్కడికి చేరుకోగా.. స్కూటీ కనిపించింది. దీంతో ఆచూకీ కోసం చుట్టుపక్కల వెతకగా ఆచూకీ లభించ లేదు. శుక్రవారం సాయంత్రం రసూల్ మృతదేహం శామీర్‌పేట పెద్ద చెరువులో లభ్యమైంది. ఆత్మహత్యకు ప్రేమ వ్యవహారమా.. ఇతర కారణాలేమైనా ఉన్నాయా.. అనే కోణంలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వేలాడుతున్న విద్యుత్ వైర్ల తొలగింపు

రామంతాపూర్ : హబ్సిగూడ డివిజన్ పరిధిలోని వెంకట్‌రెడ్డినగర్, రాంరెడ్డినగర్, వాసవీ నగర్, నౌరంగూడ, శ్రీనివాసపురం, మధురానగర్ తదితర ప్రాంతాల్లో కిందకి వేలాడుతూ.. చెట్ల మధ్యలో ఉన్న విద్యుత్ తీగలతో ప్రమాదం పొంచి ఉందని, వెంటనే వాటిని సరిచేసి చెట్ల కొమ్మలను తొలగించాలని ఉప్పల్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఆకారపరం పటేల్ విద్యుత్ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు శుక్రవారం విద్యుత్ సిబ్బంది వేలాడుతున్న తీగలను సరిచేసి చెట్ల కొమ్మలను తొలగించారు. ఈ సందర్భంగా అరుణ్ మాట్లాడుతూ.. వినాయక చవితి నవరాత్రుల ఉత్సవాలకు మండపాల వద్ద ఎలాంటి విద్యుత్ ప్రమాదాలు తలెత్తకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

బాలాజీ వేంకటేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు

అల్వాల్: టెంపుల్ అల్వాల్‌లోని బాలాజీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రావణమాస శుక్రవారం సందర్భంగా సుదర్శనహోమం నిర్వహించారు. అల్వాల్ కార్పొరేటర్ శాంతిశ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి సతీమణి మర్రి మమత హాజరై ప్రత్యేక పూజలు చేశారు. రమేష్, బీఆర్ఎస్ నేతలు, దేవాలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మత్స్య సంపదపై నజర్ !

233 చెరువుల్లో ఉచితంగా 68.05 లక్షల చేప పిల్లలు

- 10 రోజుల్లో పూర్తికానున్న టెండర్ల ప్రక్రియ
- వచ్చే నెలలో చేప పిల్లల పంపిణీకీ చర్యలు



సాక్షి,మేడ్చల్ జిల్లా: చెరువులు, కుంటలకు జలకళ రావడంతో వాటిల్లో చేపపిల్లలను వదిలేందుకు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా మత్స్యశాఖ చర్యలు తీసుకుంటోంది. మత్స్యకారులకు ఆర్థిక చేయూతనిచ్చేందుకు ప్రభుత్వం ప్రతి ఏటా ఉచితంగా చేప పిల్లలను పంపిణీ చేస్తోంది. దీనిలో భాగంగా నగర శివారు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 233 చెరువులు, కుంటలు చేప పిల్లల పెంపకానికి అనువుగా ఉన్నాయని, జిల్లా మత్స్యశాఖ గుర్తించింది. దీనికి తగిన విధంగా కార్యాచరణ రూపొందించింది.

పూర్తికానున్న టెండర్ల ప్రక్రియ..

ఈ నేపథ్యంలోనే 2025–26లో 233 చెరువుల్లో 68.05 లక్షల చేప పిల్లల పంపిణీ లక్ష్యంగా ముందుకు సాగుతోంది. ఈ మేరకు ప్రభుత్వం చేప పిల్లల పంపిణీకి సంబంధించిన టెండర్ల ప్రక్రియ వారం రోజుల్లో పూర్తి కానున్నట్లు జిల్లా మత్స్యశాఖ వర్గాలు పేర్కొంటున్నాయి. ఆగస్టు మూడో వారం నుంచి గుర్తించిన చెరువులు, కుంటల్లో చేప పిల్లలను ఉచితంగా వదిలివేసేందుకు చర్యలు తీసుకుంటోంది.

80–100 మి.మీ చేప పిల్లల పంపిణీ..

చెరువుల్లో పంపిణీ చేయనున్న మొత్తం 68.05 లక్షల చేప పిల్లల్లో 35–40 మి.మీ సైజు ఉన్న చేపపిల్లలు 54.38 లక్షలు కాగా, 80–100 మి.మీ సైజు ఉన్న చేప పిల్లలు 13.67 లక్షలు ఉన్నట్లు మత్స్యశాఖ పేర్కొంటోంది. ఇందులో 4 రకాల (తెగలు) చేప పిల్లలు ఉన్నాయి.

82 సంఘాల్లో 3,738 మంది సభ్యులు

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 82 ప్రాథమిక మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలు ఉన్నాయి. ఇందులో 3,738 మంది సభ్యులు ఉన్నారు. చేపల పెంపకం ద్వారా మత్స్యకారులు ఆర్థికంగా బలపడతారన్న సంకల్పంతో ప్రభుత్వం జిల్లా మత్స్యశాఖ ఆధ్వర్యంలో చెరువులు, కుంటల్లో చేప పిల్లలను పెంచుతోంది.

గతేడాది 68 లక్షల ఉచిత చేప పిల్లల పంపిణీ

మేడ్చల్, మల్కాజిగిరి జిల్లాలో 62 ప్రాథమిక మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల ఆధ్వర్యంలో 233 చెరువుల్లో ఉచితంగా 68.05 లక్షల చేప పిల్లలను మత్స్యశాఖ పంపిణీ చేసింది. ఈ చేప పిల్లలలో పెద్ద సైజు (80–100ఎంఎం) 13.67 లక్షలు కాగా.. చిన్న సైజు చేప పిల్లలు (40–45 ఎంఎం) 54.38 లక్షలు ఉన్నట్లు మత్స్యశాఖ పేర్కొంటోంది. మేడ్చల్, మల్కాజిగిరి జిల్లాలో మండలాల వారీగా చేపల పంపిణీ ఈ విధంగా ఉంది.

త్వరలో చేప పిల్లలు పంపిణీ

మత్స్యకారులకు ఆర్థికచేయూతను అందించేందుకు చెరువుల్లో ఉచితంగా చేప పిల్లలను వదిలేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నాం. 10 రోజుల వ్యవధిలో చేపపిల్లలకు సంబంధించిన టెండర్ల ప్రక్రియ పూర్తయ్యే అవకాశం ఉంది. కలెక్టర్ ఆదేశాలతో గుర్తించిన 233 చెరువుల్లోనే చేపపిల్లలు పంపిణీ చేస్తున్నాం. వచ్చే నెల మొదటి వారంలో నుంచి చేప పిల్లలను చెరువుల్లో వదులుతాం.

– సుకీర్త, జిల్లా మత్స్యశాఖ అధికారి

మండలం	చేప పిల్లల సంఖ్య	చెరువుల సంఖ్య
శామీర్ పేట్	23,04,740	68
మేడ్చల్	21,64,230	78
కీసర	4,59,120	25
ఘట్‌కేసర్	4,50,650	18
కుత్బుల్లాపూర్	3,84,154	04
దుండిగల్	6,81,510	24
బాచుపల్లి	78,840	05
అల్వాల్	23,520	02
కాప్రా	11,9460	07
మేడిపల్లి	39,120	02
మొత్తం	68,05,000	233

జిల్లాలో అక్షరాస్యతను పెంచాలి

జిల్లా అదనపు కలెక్టర్ రాధికా గుప్తా



సాక్షి,మేడ్చల్ జిల్లా: మహిలందరూ ముందుకొచ్చి బాధ్యతాయుతంగా మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో అక్షరాస్యతను పెంచేందుకు కృషి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ రాధికా గుప్తా తెలిపారు. చదువుకు వయస్సు అడ్డంకి కాదని, ఒకరితో మోసపోవడం, ఒకరిపై ఆధారపడకూడదన్నారు. మహిళా సంఘాల గ్రూపు సభ్యులు చుట్టు పక్కల వారందరూ చదువుకునేలా చర్యలు తీసుకోవడం ద్వారా జిల్లాను అక్షరాస్యతలో అగ్రగామిగా నిలిపాలన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో మహిళా సంఘాలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఉల్లాస్ యాప్ నమోదులో చాలా వెనుకబడి ఉన్నామని, 47,867 లక్ష్యానికి 21,263 మాత్రమే పూర్తయిందని రాధికాగుప్తా పేర్కొన్నారు. డీఆర్డీఏ సాంబశివరావు, డీఈఓ విజయకుమారి, ఉల్లాస్ ప్రాజెక్ట్ అధికారులు, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, గాజుల రామారం, ముసాపేట మున్సిపల్ సర్కిళ్ల పరిధిలోని మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వం ఆరు గ్యారంటీలను అమలు చేయాలి



సమావేశంలో పాల్గొన్న స్థానిక మహిళలు

కీసర: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయాలని సీఐటీయూ కీసర మండల నాయకుడు బంగారు నర్సింగ్‌రావు అన్నారు. శుక్రవారం నాగారం మున్సిపాలిటీ రాంపల్లి డబుల్ బెడ్రూం ప్రాంతంలో స్థానిక మహిళలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి మహిళకు నెలకు రూ.2500 హామీ, రూ.500లకే గ్యాస్ సిలిండర్, డబుల్ బెడ్రూంలో లబ్ధిదారులకు జీరో కరెంట్ బిల్లు, మహిళలకు స్వశక్తి, స్వయం ఉపాధి కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరారు. ఆరు గ్యారెంటీ పథకాల అమలుకు ఈనెల 25న కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. స్థానిక మహిళలు విజయలక్ష్మి, యాదమ్మ, సాహిన, రుక్సానా, యాదమ్మ, శకుంతల, సైదమ్మ, వర్ష తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన కృష్ణాష్టమి వేడుకలు



ఘట్‌కేసర్: త్రైత సిద్ధాంత ప్రబోధన సేవా సమితి హిందూ జ్ఞాన వేదిక ఘట్‌కేసర్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో బాలాజీనగర్‌లో నిర్వహించిన కృష్ణాష్టమి వేడుకలు శుక్రవారం ఘనంగా ముగిశాయి. 7 రోజుల పాటు జ్ఞానరీత్యా పూజలు, భగవద్గీత శ్లోక పారాయణం చేసి 7వ రోజున శ్రీకృష్ణ ప్రతిమను బాలాజీనగర్ నుంచి ఈడబ్ల్యూఎస్ కాలనీ వరకు అత్యంత వైభవంగా ఊరేగించారు. మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ పావనీజంగయ్య, మాజీ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, జంగయ్యయాదవ్, మల్లేష్, దేవేందర్‌ముదిరాజ్ స్వామివారిని దర్శించుకున్నారు. ఊరేగింపులో దేవేందర్, భాస్కర్, నరసింహ, లింగస్వామి, కుమార్, రామకృష్ణ, నాగరాజు, శివరామకృష్ణ, బుచ్చిబాబు పాల్గొన్నారు.

వినాయక చవితి ఉత్సవాలపై ఆర్డీఓ సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ వెంకటఉపేందర్

మేడ్చల్: వినాయక చవితి ఉత్సవాలకు తగిన ఏర్పాట్లు చేయాలని ఆర్డీఓ వెంకటఉపేందర్ అన్నారు. శుక్రవారం మేడ్చల్ మున్సిపల్ కార్యాలయంలో వినాయక నవరాత్రి ఉత్సవాలు, నిమజ్జన ఏర్పాట్లపై మున్సిపల్, రెవెన్యూ, పోలీస్, ట్రాఫిక్, ఫైర్, ఫిషరీస్, ఆర్అండ్‌బీ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆర్డీఓ అధికారులకు సూచించారు. తహసీల్దార్ భూపాల్, కమిషనర్ చంద్రప్రకాష్, ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

పండుగను ప్రశాంతంగా నిర్వహించుకోవాలి

శామీర్‌పేట్: వినాయక చవితి ఉత్సవాలను ప్రజలు, యువకులు ప్రశాంతంగా నిర్వహించుకోవాలని జినోమ్ వ్యాలీ ఇన్‌స్పెక్టర్ గురువయ్య అన్నారు. అలియాబాద్ చౌరస్తాలోని ఓ గార్డెన్‌లో భాగ్యనగర్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో శుక్రవారం శాంతి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి తూంకుంట, అలియాబాద్, మూడుచింతలపల్లి మున్సిపాలిటీల్లోని గణేష్ ఉత్సవ సమితి నిర్వాహకులు పాల్గొన్నారు. ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ.. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా వినాయక ఉత్సవాలను నిర్వహించుకోవాలని, ప్రతి మంటపానికి అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. జిల్లా ఆర్టీఏ మెంబర్ జైపాల్‌రెడ్డి, బీజేపీ సీనియర్‌నేత శ్రీనివాస్, శామీర్‌పేట్ డీఐ రాజు, తూంకుంట మున్సిపల్ డీఈ సునీత, మూడుచింతలపల్లి మున్సిపల్ మేనేజర్ ఉష, ఎస్సై దశరథ, శశివర్ధన్‌రెడ్డి, భాగ్యనగర్ ఉత్సవ సమితి సభ్యులు, యువజన సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న మోతె వెంకట్‌రెడ్డి

కీసర: రాష్ట్రంలో జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయూడబ్ల్యూజే) రాష్ట్ర కోశాధికారి మోతె వెంకట్‌రెడ్డి అన్నారు. టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షులు గడ్డమీది బాలరాజు ఆధ్వర్యంలో కీసరలో జిల్లా విస్తృతస్థాయి కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మోతె వెంకట్‌రెడ్డి హాజరై మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లవుతున్నా.. ఇప్పటికీ జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించడం లేదని ఆరోపించారు. తక్షణమే జర్నలిస్టుల ఆరోగ్య భద్రత కోసం ఆరోగ్య కార్డులను పునరుద్ధరించాలని, అన్ని ఆసుపత్రుల్లో చెల్లుబాటయ్యేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అక్రిడియేషన్ నియమనిబంధనలను తక్షణమే విడుదల చేసి కొత్త కార్డులను జారీ చేయాలని కోరారు. జిల్లా కమిటీ ఉపాధ్యక్షులు, సహాయ కార్యదర్శులు కృష్ణ, రామకృష్ణ, బాల్‌రెడ్డి, గోవింద్, రచ్చ శ్రీనివాస్, వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్, మల్లేష్‌గౌడ్, జిల్లా కమిటీ సభ్యులు నాగేంద్రచారి, దయాకర్‌రెడ్డి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

చెరువు శిఖం భూములు విక్రయిస్తున్నారని ఫిర్యాదు

మేడ్చల్: పట్టణంలోని తుమ్మ చెరువు శిఖం భూమిని అధికార పార్టీకి చెందిన కొంతమంది నేతలు ప్లాట్లు చేసి విక్రయిస్తున్నారని, పట్టణ బీజేపీ నాయకుడు శ్రీనివాస్‌గౌడ్ అధికారులకు ఫిర్యాదు చేశారు. జిల్లా, రాష్ట్ర అధికారులకు ఆన్‌లైన్ ద్వారా ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు. పట్టణానికి చెందిన అధికార పార్టీ నాయకుల అండదండలతో శిఖం భూమిని ప్లాట్లుగా చేసి విక్రయిస్తున్నారన్నారు. అధికారులు సమగ్ర విచారణ చేసి శిఖం భూములను అన్యాక్రాంతం చేస్తున్న వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన



మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులు

కీసర: విద్యార్థులు సైబర్ నేరాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కీసర ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులు అన్నారు. శుక్రవారం బోగారంలోని మహాత్మ జ్యోతిబాపూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ బాలుర వసతి గృహంలో రాచకొండ పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు ఇన్‌స్పెక్టర్ సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ.. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, చెడు వ్యసనాలకు బానిస కావొద్దని సూచించారు. ఎస్సై వెంకటేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉల్లాసంగా ఓరియెంటేషన్ డే



మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని సెయింట్ పీటర్స్ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం ఓరియెంటేషన్‌డే కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ఆడిటోరియంలో మొదటి సంవత్సరం విద్యార్థులకు నిర్వహించిన కార్యక్రమంలో బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్, జేఎన్‌టీయూహెచ్ ప్రొఫెసర్ కామాక్షి ప్రసాద్, జాయింట్ హెచ్ఆర్ ప్రొఫెసర్ శశాంక్ వలాలా పాల్గొని విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. కళాశాల చైర్మన్ బాలారెడ్డి, సెక్రటరీ టీవీ.రెడ్డి, డైరెక్టర్ రామస్వామి రెడ్డి, సరోజారెడ్డి, అనురాగ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ చంద్రశేఖర్‌రెడ్డి, పీఆర్వో రవిసుధాకర్, హెచ్ఓడీ గురురాజ్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నిమజ్జన ఏర్పాట్లపై సమీక్ష

మున్సిపల్ కమిషనర్ జ్యోతి



శామీర్‌పేట పెద్దచెరువును సందర్శించిన అధికారులు



అధికారుల సమీక్షలో కమిషనర్ జ్యోతి

శామీర్‌పేట్: పకడ్బందీగా వినాయక నిమజ్జన ఏర్పాట్లు చేయాలని మున్సిపల్ కమిషనర్ జ్యోతి అన్నారు. శుక్రవారం తూంకుంట మున్సిపల్ పరిధి, శామీర్‌పేట పెద్ద చెరువు వద్ద వినాయక నిమజ్జన ఏర్పాట్లపై మున్సిపల్ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షలో జిల్లా ఆర్టీఏ మెంబర్ జైపాల్‌రెడ్డి, శామీర్‌పేట ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్, మేడ్చల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మధుసూదన్, ఇతర అధికారులు పాల్గొన్నారు. అనంతరం శామీర్‌పేట పెద్దచెరువును సందర్శించి, క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వినాయక నిమజ్జనాలకు క్రేన్లు, బారికేడ్లు, లైటింగ్ ఏర్పాట్లపై సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. మున్సిపల్ డీఈ సునీత, ఇరిగేషన్ ఏఈ రాజీవ్, ఎస్సై శశివర్ధన్ రెడ్డి, విద్యుత్ ఏఈ రాఘవేంద్ర, మెడికల్ ఆఫీసర్ విజయనిర్మల, ఆర్అండ్‌బీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కీసర ఇన్‌స్పెక్టర్‌కు సత్కారం



కీసర: కీసర పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులును శుక్రవారం తెలంగాణ రాష్ట్ర సూర్యి సంఘం అధ్యక్షుడు మోహన్‌లాల్‌చౌదరి కలిసి రాజస్థాని పగడి శాలువాతో ఘనంగా సత్కరించారు.

మున్సిపల్ కార్యాలయంలో సమాచార పట్టికేది ?



ఘట్‌కేసర్ మున్సిపల్ కార్యాలయం

ఘట్‌కేసర్: మున్సిపల్ కార్యాలయంలో పౌర సమాచార పట్టిక కనిపించడం లేదు. వివిధ పనుల కోసం కార్యాలయానికి వస్తున్న సామాన్యులకు ఎవరిని కలవాలో తెలియక, సమాధానం చెప్పేవారు లేక సతమతమవుతున్నారు. ప్రధానంగా ఆర్టీఐ అప్పిలేట్ అధికారి పేరు, ఫోన్ నెంబర్ ఇతర వివరాలు నోటీస్ బోర్డులో ఇప్పటి వరకు నమోదు చేయలేదు. పాత కార్యాలయం నుంచి నూతన కార్యాలయంలోకి మారి 2 నెలలు అవుతున్నా.. మున్సిపల్ కార్యాలయం అధికారుల వివరాలు తెలియక ప్రజలు వెనుదిరిగిపోతున్నారు. ఆర్టీఐ సమాచారం అడిగిన వారికి సమాధానం చెప్పేవారు లేని దుస్థితి నెలకొంది. వివరాలు ఎవరిని అడగాలో తెలియడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ కమిషనర్ స్పందించి పౌర సమాచార పట్టిక నోటీస్ బోర్డులో పెట్టి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

కమిషనర్‌కు సత్కారం

పోచారం: పురపాలక సంఘం కమిషనర్‌గా బాధ్యతలు తీసుకున్న నిత్యానంద్‌ను కాంగ్రెస్ నేతలు శుక్రవారం కలిసి శాలువాతో సత్కరించారు. మున్సిపల్ అభివృద్ధికి కృషి చేయాలని కమిషనర్‌ను ఈ సందర్భంగా కోరారు. కాంగ్రెస్ పార్టీ పోచారం మున్సిపల్ అధ్యక్షుడు సింగిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, మండల అధ్యక్షుడు కర్రె రాజేష్, మాజీ కౌన్సిలర్ బాలగోని వెంకటేష్‌గౌడ్, నాయకులు గణేష్‌యాదవ్, యూసుఫ్, ఎర్ర రాజు, లక్ష్మి, అంజన్, వినోద్, మల్లికార్జునరెడ్డి, వెంకట్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, నరేష్‌గౌడ్, సహదేవ్, సగ్గు శ్రీను, శ్రీశైలం, దర్శన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలి

అధికారుల సమావేశంలో కలెక్టర్ మను చౌదరి



మాట్లాడుతున్న కలెక్టర్ మను చౌదరి, అదనపు కలెక్టర్ రాధికాగుప్తా

సాక్షి,మేడ్చల్ జిల్లా: జిల్లాలోని దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలోని అహ్మద్‌గూడ 2బీహెచ్‌కే కాలనీలోని సమస్యలను ప్రాధాన్యత క్రమంలో గుర్తించి అత్యవసరమైన వాటిని ముందుగా పరిష్కరించాలని మేడ్చల్– మల్కాజిగిరి జిల్లా కలెక్టరు మిక్కిలినేని మనుచౌదరి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ వీసీ హాల్‌లో జిల్లా అదనపు కలెక్టర్ రాధికాగుప్తాతో కలిసి అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. డబుల్ బెడ్రూం ఇళ్లలో నివసిస్తున్న ప్రజలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వారి సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు.

ప్రైమరీ స్కూల్ ఏర్పాటు చేయాలి

స్థానికులు కోరినట్లుగా ప్రైమరీ స్కూల్‌ను ఏర్పాటు చేయాలన్నారు. జీరో ఎన్‌రోల్‌మెంట్ స్కూళ్ల ఏర్పాటుకు అవసరమైన ప్రతిపాదనలను పంపాలని జిల్లా విద్యాశాఖాధికారిని కలెక్టర్ ఆదేశించారు. బస్తీ దవాఖాన ఏర్పాటుకు అవసరమైన పరిపాలన మంజూరుకు నివేదికలు పంపాలని, డీఎంహెచ్ఓను కోరారు. అంగన్‌వాడీ సెంటర్ కావాలని జిల్లా సంక్షేమశాఖ అధికారికి సూచించారు.

వెల్ఫేర్ అసోసియేషన్ ఏర్పాటుకు చర్యలు

24 బ్లాకులు ఉన్న 2బీహెచ్‌కే కాలనీలో రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్‌ను ఏర్పాటు చేసి ఎన్నికలు నిర్వహించి అధ్యక్షులు, సభ్యులను ఎన్నుకుని వారి ద్వారా చిన్న, చిన్న సమస్యలను ఎప్పటికప్పుడు తీర్చుకునేలా సామాజిక బాధ్యతగా వ్యవహరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అసోసియేషన్‌కు ఒక బ్యాంక్ అకౌంట్ ఓపెన్ చేయించాలని జిల్లా కో– ఆపరేటివ్ అధికారికి కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.

- కాలనీకి సమీపంలో ఒక రేషన్‌షాపును ఏర్పాటు చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా సివిల్ సప్లై అధికారిని ఆదేశించారు. డ్రైనేజీ, వరద నీరు నిలవకుండా పైపులైన్ ఏర్పాటు చేయాలన్నారు.

స్థానిక సమస్యలపై

డబుల్‌బెడ్రూంలలోని అన్ని బ్లాకులకు రూఫ్ డ్యామేజీని చిప్పింగ్ చేయించాలని, ట్యాంక్ వాటర్ లీకేజీ, ప్రహరీ నిర్మాణం, ఆటస్థలం వద్ద ఉన్న సంపునకు ఫెన్సింగ్, పిల్లలకు ఆట వస్తువుల ఏర్పాటు, లిఫ్ట్ సమస్యలను పరిష్కరించాలన్నారు. దీనికి అవసరమైన ప్రతిపాదనలను పంపాలని కలెక్టర్ ఆదేశించారు. ఎలక్ట్రిసిటీ పోల్స్, ట్రాన్స్‌ఫార్మర్లు ఇళ్లకు దగ్గరగా ఉన్నాయని, వాటికి ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని విద్యుత్‌శాఖ అధికారులకు సూచించారు. కాలనీవాసులకు గృహజ్యోతి పథకం అమలుకావడం లేదని, అందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కాలనీలో రోడ్డు మలుపు దగ్గర ఫ్లాష్ లైట్లు, స్పీడ్ బ్రేకర్లు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు.

- పారిశుద్ధ్య కార్మికులు చెత్త సేకరించేలా, స్ట్రీట్ లైట్లు ఏర్పాటు చేసేలా మున్సిపల్ కమిషనర్‌ను కలెక్టర్ ఆదేశించారు. కాలనీవాసుల ఉపాధికి చిన్న చిన్న వ్యాపారాలు చేసుకునేందుకు బ్యాంకు ద్వారా లోన్ ఇచ్చేలా ఒక మేళా ఏర్పాటు చేసి వారి నుంచి దరఖాస్తులు తీసుకోవాలన్నారు. డీఈఓ విజయకుమారి, డీఎంహెచ్ఓ ఉమాగౌరి, డీఎస్ఓ శ్రీనివాస్‌రెడ్డి, డీడబ్ల్యూఓ శారద, జిల్లా హౌజింగ్ అధికారి రమణమూర్తి, దమ్మాయిగూడ మున్సిపల్ కమిషనర్ వెంకట్‌రెడ్డి, డీసీఓ వెంకట్‌రెడ్డి, జీహెచ్ఎంసీ ఈఈ, ఆర్అండ్‌బీ అధికారి తదితరులు పాల్గొన్నారు.